క్లుప్తంగా

నేటి నుంచి హజరత్ ముక్కే షావలి ఉరుసు ఉత్సవాలు



ముక్కే షా వలి దర్గా

దువ్వూరు : పాత దువ్వూరులో వెలసిన హజరత్ సయ్యద్ ముక్కే షావలి రహమతుల్లా అలై 557వ ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పూల జబ్బార్ తెలిపారు. ఈ ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయని, 2న గంధం, 3వ తేదీ ఉరుసు, 4వ తేదీ తహలీల్ ఫాతెహాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన వివరించారు. ఈ ఉరుసు ఉత్సవాలకు కడప, కర్నూలు జిల్లాల నుంచేగాక తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు హాజరవుతారని తెలిపారు. మూడు రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం 8వ రోజు ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పేదల స్థలాలకు కొందరు నకిలీ పత్రాలను సృష్టించి అమ్ముకుంటున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హసీనా, ఫాతిమా, ఈశ్వరమ్మ, పర్వీన్, లత, సాబీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా విద్యాసాగర్



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల తహసీల్దార్‌గా విద్యాసాగర్‌ను నియమించారు. ఎన్నికల బదిలీలో భాగంగా డోన్ మండలంలో పనిచేస్తున్న విద్యాసాగర్‌ను ప్రొద్దుటూరుకు బదిలీ చేయగా, ఇక్కడ పనిచేస్తున్న నజీర్ అహ్మద్‌ను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



ఎం. కృష్ణ, మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన ఎం.క్రిష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో విజయవాడ సర్కిల్-3 జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈయనను బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

దువ్వూరు : దువ్వూరు సచివాలయం-2 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఈ వైద్య శిబిరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశామని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆసరా చెక్కు పంపిణీ

కలసపాడు : స్థానిక ఎంఈఓ కార్యాలయ సమీపంలోని క్రీడా మైదానంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సగిలిసుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరవుతారని తెలిపారు. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

3న కాశినాయనలో...

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ డ్వాక్రా మహిళా సంఘాలకు అందజేస్తారని ఏపీఎం వీరాంజనేయులు తెలిపారు. మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పోరుమామిళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, అధ్యక్షతన, కో ఆర్డినేటర్ మల్లికార్జున ఆధ్వర్యంలో గురువారం కొండుగారిపల్లెలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజులపాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్పెషల్ క్యాంపు కొండుగారిపల్లెలో ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పాఠశాల పరిసరాలు పరిశుభ్రం చేయడం, కంపచెట్లు తొలగించడం చేశారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని గెలిపించండి



రాజుపాలెంలో వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



సమావేశానికి హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు

ప్రొద్దుటూరు : జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో మేలు చేసిన ప్రభుత్వాన్ని గెలిపించి మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సోములవారిపల్లె పంచాయతీ ప్రజలు తనకు ప్రత్యేకమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేశారన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా ద్వారా సంఘాల మహిళల రూ.200 కోట్లు రుణమాఫీ చేసి పూర్తిగా చెల్లించిన జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సోములవారిపల్లె ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని తిరిగి అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాష, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండోసారి జగనన్నకు పట్టం కడదాం

రాజుపాళెం : జగనన్న అందరి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ద్వారా అందిన ప్రయోజనాలను గుర్తుంచుకోవాలని, వచ్చే ఎన్నికల్లో సహాయం చేసి మాట నిలబెట్టుకున్న వారికే ఓటు వేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో మాటలు చెప్పి మోసం చేసిన వారిని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వైఎస్సార్ ఆసరా కింద రూ.2.69 కోట్ల మెగా చెక్కును పొదుపు సంఘాలకు అందించారు. మండల వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, ఎంపీపీ సలోమి, వైస్ ఎంపీపీ-2 సుబ్బరత్నమ్మ, ఏరియా కోఆర్డినేటర్ లావణ్య, ఏపీఎం జయరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శేఖర్ రెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ఆయా గ్రామాల్లోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు సరికాదు

ప్రొద్దుటూరు : తన వ్యక్తిత్వాన్ని బలహీనపరిచే విధంగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్యాయమైన, నీచమైన వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక 35వ వార్డులో రూ.20లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ అన్ని వర్గాలకు తాను చేసే ఆర్థికసాయం అసాంఘిక కార్యకలాపాల నుంచి సంపాదించిన సొమ్మనని వరద చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన సోదరుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సంపాదించిన సొమ్ములో కొంత భాగం సహాయ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నానే తప్ప ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల వచ్చిన సొమ్ముతో కాదని తెలిపారు. తనపై అసూయతో ప్రజలలో ఉనికి కోల్పోతున్నామన్న భయంతో నీచమైన రాజకీయ విమర్శలకు వరద దిగుతున్నారని ధ్వజమెత్తారు. ఏనాడైనా పేద ప్రజలకు అవసరం వస్తే ఆర్థిక సహాయం చేశావా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యులు మల్లికార్జున యాదవ్, నాయకులు సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని వ్యక్తి సీఎం వైఎస్ జగన్



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

– ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : మాట ఇచ్చాడంటే ఆ మాటను తప్పక నెరవేర్చే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన బి.కోడూరు వెలుగు సభా భవనంలో వెలుగు ఏపీఎం సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి మాట తప్పే చంద్రబాబు మాదిరి కాదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే ఆ మాటకు కట్టుబడి ఎన్ని ఇబ్బందులు, అవాంతరాలు ఎదురైనా కట్టుబడి పనిచేస్తారని తెలిపారు. అందుకు నిదర్శనమే నవరత్నాల హామీల అమలు అన్నారు. రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ హామీలను అమలు చేస్తూ ముందుకెళుతున్నారని, అలాంటి వ్యక్తిని మనం ఎన్నటికీ మరువకూడదన్నారు.డ్వాక్రా మహిళలు మరింత అభివృద్ధి చెంది ముందుకు సాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం వల్లే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బి.కోడూరు మండలానికి వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కింద రూ.1,74,36,178ల నిధులను విడుదల చేసి వారి అకౌంట్లలో జమ చేశారన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును వారు అందజేశారు. పీఆర్ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, మాజీ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యోగానందరెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, చంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ బి.వి.సుబ్బారెడ్డి, వెలుగు సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వృత్తి విద్య చాలా ఉపయోగకరం



టైలరింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాపాడు: వృత్తి విద్య శిక్షణలో భాగంగా ప్రత్యక్షంగా బోధించిన అనుభవం ఎంతో ఉపయోగకరమని కస్తూర్బా ప్రిన్సిపాల్ నాగలక్షుమ్మ అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణలో భాగంగా ఐసెక్ట్ వారి సహకారంతో గురువారం లీలా సాయి కుట్టు మిషన్ కేంద్ర సందర్శన చేయించారు. కుట్టు మిషన్ కేంద్రంలోని మిషన్ విభాగాలు, కుట్టు విధానం, ఫ్యాషన్ డిజైన్ వంటి వాటిని చూపిస్తూ టైలరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తరగతి గదుల్లో పుస్తకాలను చదవడం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయడంలో చాలా తేడాలు ఉంటాయన్నారు.వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ, వృత్తి విద్య శిక్షకులు జి.రాణి, ఉపాధ్యాయినిలు ఖదిరున్నీసా పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని త్యాగరాజస్వామి ఆలయంలో గురువారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కుటుంబ సభ్యులు త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంపై త్యాగరాజ స్వామి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాతకోట వంశీధర్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడిసాయినాథుని వార్షికోత్సవం

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లెలో కొలువైన శ్రీషిర్డీ సాయినాథుని నాలుగవ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుండే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన ఐడీపీఎస్ విద్యార్థులు



చాపాడు: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలలో స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి తెలిపారు. అండర్-8 రిలే విభాగంలో 2వ తరగతికి చెందిన దీక్షత్ రెండు బంగారు పతకాలు, అండర్-10లో నక్షత్ర 2 సిల్వర్, ఒక బ్రాంజ్, పి.మోక్షజ్ఞ 2 సిల్వర్ పతకాలు సాధించారు. త్వరలో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు పాల్గొననున్నట్లు కరస్పాండెంట్ తెలిపారు. తమ స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ పోటీలకు ఎంపికవడం పట్ల ప్రిన్సిపాల్ రవీంద్ర, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వివేకానందుడు యువతకు స్ఫూర్తి



వివేకానంద పుస్తకాలను ఇస్తున్న అధ్యాపకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూమిరెడ్డి వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద ఫౌండేషన్ పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో «స్వామి వివేకానంద జీవితం-యువతకు ఆదర్శం» అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మీద తమకు విశ్వాసం కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ లక్ష్య సాధనకు వివేకానందుని వాక్కులు స్ఫూర్తి మంత్రంలా దోహదపడుతాయని తెలిపారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

దువ్వూరు : సార్వత్రిక ఎన్నికల బదిల్లో భాగంగా తహసీల్దార్ రమకుమారి శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. గురువారం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దువ్వూరు మండలంలో పనిచేయడం చాలా సంతోషంగా ఉందని, తన దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించి న్యాయం చేశానని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఆలీఖాన్, ఆర్ఐలు జాన్సన్, నారాయణ స్వామి, సర్వేయర్ పద్మావతి, వీఆర్ఓలు రమణారెడ్డి, రవి, దేవ, శాంతి, లలిత, గ్రామరెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

13వ వార్డులో మున్సిపల్ వైఎస్ చైర్మన్ పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక 13వ వార్డులో గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీళ్లు నిలుస్తున్నాయని, దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు తెలిపారు. త్వరలో రోడ్డు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నామని వైస్ చైర్మన్ తెలిపారు. కౌన్సిలర్ పిట్టా బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గరిశపాటి వంశీ పాల్గొన్నారు.

ఖాజీపేట సీఐగా రామాంజులు



ఖాజీపేట: ఖాజీపేట నూతన సీఐగా పి.రామాంజులు బాధ్యతలు స్వీకరించారు. ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌ను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఎస్ఐ స్థానంలో సీఐ స్థాయి అధికారిని నియమించింది. దీంతో ఖాజీపేట ఎస్ఐగా పనిచేసిన రాజరాజేశ్వర్‌రెడ్డి మైదుకూరు కు బదిలీ చేశారు. కోవెలకుంట్ల లో సీఐగా పనిచేస్తున్న పి.రామాంజులును ఖాజీపేట స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

గోపవరం : మండల అభివృద్ధి అధికారిగా సుబ్రమణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎంపీడీఓగా పనిచేస్తున్న సుబ్రమణ్యంను గోపవరం ఎంపీడీఓగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా వీడ్కోలు

మైదుకూరు : మైదుకూరు మండలంలో విధినిర్వహణలో ప్రతి ఒక్కరూ సహకరించారని, అందరి సహకారం మరువలేనిదని బదిలీ అయిన తహసీల్దార్ బి.అనురాధ అన్నారు. తహసీల్దార్‌గా ఉన్న అనురాధ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. గురువారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. డీటీలు మల్లికార్జున, బాబా ఫక్రుద్దీన్, అంకాలయ్య, ఆర్ఐ మహేంద్రనాథ్ రెడ్డి, వీఆర్ఓలు, సిబ్బంది తహసీల్దార్ అనురాధను సత్కరించి వీడ్కోలు పలికారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్ర, శనివారాల్లో మరమ్మతులు చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య తెలిపారు. మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారాల్లో విద్యుత్ అంతరాయం జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం సచివాలయం-2కు చెందిన జగనన్న కాలనీకి సంబంధించి 8 మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు గురువారం రిజిస్ట్రేషన్ చేయించారు. మండలానికి సంబంధించి మొదటి స్థానిక సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ రత్నమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటసునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌ఓలు ఉండేల శ్రీదేవి, సునీల్ పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చేసినందుకు సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివచంద్రారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలకు దాదాపు రూ.12.26కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. అలాగే కొత్తపల్లె గ్రామంలో ముస్లిం మైనారిటీల కేటాయించిన శ్మశాన వాటికు రూ.12లక్షలతో నిర్మించిన ప్రహరీని సర్పంచ్ శివచంద్రారెడ్డి పరిశీలించారు. కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఐకు సన్మానం

ప్రొద్దుటూరు : ఒకే వారంలో రెండు సార్లు ప్రశంసలు అందుకున్న స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఇబ్రహీంను గురువారం కౌన్సిలర్ జిలాని బాషా, శ్రీనివాసనగర్‌లోని నూరాని మసీద్ కమిటీ ప్రెసిడెంట్ టప్పా మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో సన్మానించారు. ఉత్తమ సేవలు అందించినందుకు సీఐ ఇబ్రహీంను కలెక్టర్, ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందించారని వారు పేర్కొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



బి.మఠం మండలం తొట్లపల్లెలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ప్రత్యేక స్పందనలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, బద్వేల్ ఆర్డీఓ

– ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం: ప్రజల వద్దకు పాలన అందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తొట్లపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే కేంద్రం, నరసన్న పల్లెలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం దూరం ఉండకూడదని పరిపాలన వ్యవస్థను ప్రజల వద్దకు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి కావాల్సిన మౌలిక వసతులతోపాటు సంక్షేమ ఫలాలను అందించేందుకు వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. మైదుకూరు నియోజకవర్గం సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మీదేవి, ఎంపిటీసీ ఆర్ రామసుబ్బమ్మ, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి. జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, పీఆర్ డీఈఈ మహేశ్వర్‌రెడ్డి, ఏఈ మధు, ఎంపీడీఓ ఆఫీసు ఇన్‌చార్జీ మల్లికార్జున. పంచాయితీ కార్యదర్శి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకలు రాయపురెడ్డి ఓబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరు నరసింహరెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సచివాలయం సిబ్బంది, జోగయ్య, రాజానాయుడు. నారాయణ, ఎంపిటీసీలు మనోహరాచారి, పోలు అంకిరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక రెవెన్యూ సదస్సుకు అపూర్వ స్పందన

బ్రహ్మంగారిమఠం: రెవిన్యూ సమస్యలను పూర్తిస్థాయిలో తీర్చాలని పట్టుదలతో ఉన్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరిక గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బద్వేల్ ఆర్డీఓ ఆవుల వెంకటరమణ పరిష్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కలెక్టర్ ఆదేశాలమేరకు ఆర్డీఓ అధ్యక్షతన ప్రత్యేక స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నరసన్నపల్లె, సోమిరెడ్డిపల్లె, పలుగురాళ్ళపల్లె, డి.నేలటూరు గ్రామాలలో అధికంగా భూసమస్యలు ఉన్నాయి. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందనలో దాదాపు 200మంది వారి సమస్యలను వినతి పత్రాల రూపంలో అధికారులకు ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే చాలా ఓపిక తో వింటూ అధికారులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, ఎంపీపీ సి .వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, విఆర్‌ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎంఈఓ నిర్మల

కాశినాయన :మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఎంఈఓ నిర్మల, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ ప్రారంభించారు. అమెరికాలో నివాసముంటున్న డాక్టర్ ఫణిరాజ్‌కుమార్ గతేడాది డిసెంబర్ 20న పాఠశాలను సందర్శించారు. నాడు-నేడు ద్వారా అందంగా రూపుదిద్దుకుంటున్న పాఠశాల పరిసరాలను చూసి ఆనందపడ్డారు. విద్యార్థులతో మాట్లాడి గ్రంథాలయ ఏర్పాటుకు రూ.50 వేలు విరాళంగా అందించారు. ఆ విరాళంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి న్యూస్‌పేపర్లతో పాటు వివిధ రకాల పుస్తకాలను ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణిరాజ్‌కుమార్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, వాకాచంద్రశేఖర్, జ్యోతి, సురేష్‌కుమార్, పరిమళజ్యోతి, విజయలక్ష్మి, సీఆర్‌పీ రవి కృతజ్ఞతలు తెలియజేశారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కార్మికులు



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు : నూతన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను గురువారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలపు వేతనాలు ఇవ్వాలని, సంక్రాంతి పండుగ బోనస్, అదనంగా రూ.1000, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, జాకోబ్, ఓబయ్య, మరియమ్మ పాల్గొన్నారు.